ఈటీవీ-ఆదిలాబాద్

ఉమ్మడి జిల్లాలో పంటలకు వినియోగించే జీవ రసాయనాల(బయోమందుల) విక్రయం పేరిట రూ.కోట్ల అక్రమ దందా దర్జాగా నడుస్తోంది. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని రసాయన మందులతోనే గుర్తుపట్టనట్లుగా కొంత మార్పిడి చేసి జీవ/సేంద్రియ మందులని నమ్మించి విక్రయించే ప్రయత్నం జరుగుతోంది.

బయో పేరిట మాయోపాయం

● దర్జాగా అక్రమ దందా

ఆదిలాబాద్, ఉట్నూరు, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, భైంసా, మంచిర్యాల, జైపూర్, చెన్నూరు, లక్షెట్టిపేట, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, కౌటాల, జైనూర్ కేంద్రాలుగా విచ్చలవిడిగా జరుగుతున్న నకిలీ రసాయనాల అమ్మకాల వెనక కొన్ని కంపెనీల ప్రతినిధులు, డీలర్లు, మరి కొంతమంది వ్యాపారులతో కలిసి ఏర్పడిన ముఠాల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది.

☛ నిబంధనల ప్రకారమైతే తెలంగాణ ఎరువుల నియంత్రణ పరిధిలోకి వచ్చిన బయో ఫర్టిలైజర్ చట్టానికి లోబడి జీవ రసాయనాలను విక్రయించాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి తీసుకోవాల్సి ఉంది.

☛ తయారు చేసిన కంపెనీల వివరాలు, వాటి వినియోగంతో నేల విషపూరితం కాదనీ, మనుషులు, ఇతర జంతుజాలానికి ప్రమాదం లేదని నిరూపించేలా వ్యవసాయ విశ్వవిద్యాలయాల ల్యాబ్‌ల నివేదికలను అందుబాటులో ఉండాలి.

☛ ఇవేం లేకుండానే కొంతమంది వ్యాపారులు, కంపెనీల ప్రతినిధులు కలిసి మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ నుంచి తెచ్చే మందులతోపాటు స్థానికంగానే తయారు చేసేవి మరికొన్నింటి కలిపి రైతులకు విక్రయించే దందా నడుస్తోంది.

● రెండు నెలల కిందట ఆదిలాబాద్‌లో ఓ వ్యక్తి నకిలీ బీటీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి సమీపంలో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని గోదాంలో తనిఖీ చేశారు. నకిలీవిత్తనాలతో పాటు అనుమతి లేని జీవరసాయన ఎరువులు ఉన్నట్లు తేలింది.

కరవైన నిఘా

● నకిలీ విత్తనాలు విక్రయించిన ప్రతి ఒక్కరికీ నకిలీ జీవ రసాయనాలతో సంబంధం ఉన్నట్లు పోలీసుల దృష్టికి వెళ్లింది. ● టాస్క్‌ఫోర్స్ కమిటీల తనిఖీలు నామమాత్రం కావటంతో ఆశించిన ప్రగతి కనిపించటం లేదు. ఉమ్మడి జిల్లాలో మెజార్టీ దుకాణాల్లో రోజూ రూ.లక్షల్లో జీవ రసాయన వ్యాపారం సాగుతోంది. 'మామూలు'గా తీసుకుంటున్న వ్యవసాయ శాఖ చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. ● ఈ బయో ఎరువులు వాడగానే రెండు, మూడు రోజుల పాటు మొక్క ఆకుపచ్చగా కనిపిస్తుంది. కాండం పెరిగినట్లు అనిపిస్తుంది. ఆ తర్వాత మళ్లీ యథావిధిగానే ఉంటుంది.

కావాల్సిన టిక్కర్స్

బయో మందుల సీసాలపై దుకాణాదారులు కావాల్సిన పేరుతో టిక్కర్స్(లేబుల్స్)ను అతికించి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. రూ.300కు తయారు చేసే ఒక లీటర్ సీసాను ఏకంగా రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. దీని వెనక అక్రమార్కుల ఎత్తుగడ ఎలా ఉందో వెల్లడవుతోంది. మరి కొంతమంది ఆన్‌లైన్‌లో రూ 15 వేల నుంచి రూ.20 వేల వరకు ప్రభుత్వ అనుమతి ఉందంటూ వెల్లడించేలా నకిలీ ల్యాబ్ పత్రాలు కొనుగోళ్లు చేసుకుంటున్నట్లు తెలిసింది.

పాఠం వినండి.. అప్పుడప్పుడు పైకి చూడండి

సిరికొండ మండలం రిమ్మ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఎప్పుడు కూలిపోయి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. 15 మంది పిల్లలు ఉన్న ఈ అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. గ్రామంలోని పాఠశాల భవనంలో ఈ మినీ అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. ఏళ్ల క్రితం నిర్మించిన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షం కురిసినప్పుడు సరకులు తడిసి ముద్దవుతున్నాయి. పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారి పిల్లలపై ఎప్పుడు పడిపోతుందోనని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. - సిరికొండ, న్యూస్‌టుడే

దారి దాచేసి.. కలిపి అమ్మేసి

● అధికారుల నిర్లక్ష్యంతో లేఅవుట్‌కు డీటీసీపీ ఆమోదం

నిఘా

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే

తాంసి మండలం పొన్నారి గ్రామం నుంచి ఆదిలాబాద్ పట్టణానికి రావడానికి అదొక పాత రహదారి.. రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఉపయోగపడే దారి. మావల మండలం బట్టిసావర్గాం శివారులో జాతీయ రహదారి పక్కన వెలిసిన ఓ డీటీసీపీ లేఅవుట్, దాని తర్వాత ఏర్పడిన మరో కచ్చా లేఅవుట్‌లో ఆక్రమణకు గురైంది. డీటీసీపీ లేఅవుట్‌లోనే 100 మీటర్ల పొడవునా అయిదు ప్లాట్లు చేశారు. వాటి విలువ రూ.1.50 కోట్ల పైమాటే. అక్రమ లేఅవుట్‌లో పదికి పైగా ప్లాట్లు వెలిశాయి. దీంతో దారి పూర్తిగా మూసుకుపోయింది.

బట్టిసావర్గాం శివారులో జాతీయ రహదారి పక్కన ఆక్రమణకు గురైన దారి

రెవెన్యూ రికార్డుల ప్రకారం పొన్నారి గ్రామం నుంచి మొదలైన దారి నేరుగా జిల్లా సబ్‌జైలు పక్క నుంచి ఆదిలాబాద్‌కు వస్తుంది. అయిదారు దశాబ్దాల కిందట తాంసి, తలమడుగు మండలాల్లోని గ్రామాలకు రాంపూర్ మీదుగా ప్రధాన రోడ్డు విస్తరించడంతో ఇది మరుగున పడింది. దీనిపై ప్రతిపాదిత డీటీసీపీ లేఅవుట్‌కు 2022లో అడుగులు పడ్డాయి. దానిపక్కన అదే దారిపై మరో మూడు సర్వే నంబర్లలో మరో కచ్చా లేఅవుట్ ఏర్పడింది. డీటీసీపీ లేఅవుట్‌కు యజమానులు దరఖాస్తు చేసుకున్నప్పుడు భూకొలతల శాఖ, రెవెన్యూ అధికారులు దారి ఉన్నట్లు డిమార్కేషన్, లేఅవుట్ స్కెచ్‌లలో ఎక్కడా పొందుపర్చలేదు. దీంతో బల్దియా అధికారులు లేఅవుట్‌కు డీటీసీపీ ఆమోదం ఇచ్చేశారు.

రెండేళ్లుగా రైతుల పోరాటం

దారి ఆక్రమణకు గురైందని రెండేళ్లుగా రెవెన్యూ, భూకొలతల శాఖ, బల్దియా అధికారులకు విన్నవించినా తొలుత పట్టించుకోలేదు. ఈ విషయం ఇటీవల జిల్లా కలెక్టర్ రాజర్షి షా దృష్టికి వెళ్లడంతో సంబంధిత అధికారులను పిలిచి ఆరా తీశారు. అక్కడ దారి ఉన్న విషయం అధికారులు ఎట్టకేలకు అంగీకరించారు. దారిని పునరుద్ధరించండి అని ఆదేశించడంతో అధికారులు లేఅవుట్ యజమానులు, బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు.

పరిష్కారానికి చర్యలు

- సుమలత, టీపీఓ, బల్దియా

లేఅవుట్ ప్రతిపాదన వచ్చినప్పుడు అక్కడ దారి ఉన్నట్లు రెవెన్యూ, భూకొలతల శాఖ అధికారులు ఇచ్చిన నివేదికలో చూపించలేదు. అందుకే లేఅవుట్‌కు డీటీసీపీ ఆమోదం లభించింది. కలెక్టర్ ఆదేశాలతో దారి ఉన్నట్లు అధికారులు చెప్పారు. ఎంత వెడల్పులో ఉందో చెప్పాలని భూకొలతల శాఖ అధికారులకు లేఖ రాశాం.

అథ్లెటిక్స్‌లో బంగారు కొండలు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం

స్ఫూర్తి

వీరు అథ్లెటిక్స్ బరిలో దిగితే పతకాలు రాక తప్పదు. దేశం తరపున ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్న వీరు శిక్షకుల పర్యవేక్షణలో రోజూ మూడేసి గంటలు మైదానంలో సాధన చేస్తున్నారు. తాజాగా హనుమకొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి దక్షిణభారత అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు.

పతకాల రేస్‌వాక్

బజార్‌హత్నూర్ మండలం గిర్నూర్ గ్రామానికి **అట్టం జస్వంత్** డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆరేళ్లుగా అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్ శిక్షకులు వీజీఎస్.రాకేష్, జ్యోతీశ్వరన్ వద్ద రేస్‌వాక్ క్రీడాంశంలో శిక్షణ పొందుతున్నాడు. రాష్ట్రస్థాయిలో 2 పసిడి, 2 రజత పతకాలు సాధించాడు. పాట్నాలో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నాడు. తాజాగా హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-20 ఏళ్ల విభాగం 5000 మీటర్ల రేస్‌వాక్‌లో బంగారు పతకాన్ని గెలిచాడు.

ట్రయథ్లన్‌లో మెరిక

బోథ్ మండలం జిడిపల్లె గ్రామానికి చెందిన **తోడసం తుకారాం** జాతర్ల గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో చదువుతున్నాడు. అథ్లెటిక్స్ కోచ్ సాహుల్‌కుమార్ పర్యవేక్షణలో ట్రయథ్లన్-బీ(60మీ.ల పరుగు, హైజంప్, 5మీ.ల లాంగ్‌జంప్) క్రీడాంశంలో రాటుదేలి మెదక్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రజత పతకాన్ని అందుకున్నాడు. తాజాగా హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-14 ఏళ్ల విభాగం ట్రయథ్లన్-సీ(600మీ.ల పరుగు, 60మీ.ల పరుగు, 5మీ.ల లాంగ్ జంప్)లో పసిడి పతకాన్ని సాధించాడు.

పైన బాగుంది.. కింద కుంగింది..

● వర్షాలకు గాలిలో తేలుతున్న రోడ్లు

పరిశీలన

ఇచ్చోడ, బజార్‌హత్నూర్, న్యూస్‌టుడే

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలాల్లో పలు ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయి. వర్షపు నీటి ఉద్ధృతికి రహదారుల కింద ఉన్న మట్టి కొట్టుకుపోవడంతో కొన్నిచోట్ల రహదారులు ప్రమాదకరంగా మారాయి. రోడ్డు కింద భాగం పూర్తిగా ఖాళీ కావడంతో పైభాగంలో గాలిలో తేలుతున్నట్లుగా కనిపిస్తుంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, భారీ వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డు కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి రోడ్డుకు రక్షణ గోడల నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

మట్టి కొట్టుకుపోయి..

ఇచ్చోడ మండలంలో చించోలి గ్రామం నుంచి నవేగాం వెళ్లే దారిలో గతంలో కురిసిన వర్షానికి రోడ్డు ప్రమాదకరంగా ఉంది. రోడ్డుకింద మట్టి కోతకు గురైంది. ఎప్పుడు కూలిపోతుందోనన్న భయం వాహనదారుల్లో నెలకొంది. ప్రస్తుతం రోడ్డు కింద రాళ్లు, మట్టి తొలగిపోయి లోపల భాగం బహిర్గతమైంది. పైభాగంలో మాత్రం రహదారి ఉండటంతో వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగిస్తున్నాయి.

ప్రమాదకరంగా..

బజార్‌హత్నూర్ మండలంలోని జాతర్ల నుంచి అంద్‌గూడ వైపు వెళ్లే రహదారి జాతర్ల సమీపంలో ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి కింద ఉన్న మట్టి, కంకర కొట్టుకుపోవడంతో రోడ్డు భాగం గాలిలో వేలాడుతూ కనిపిస్తుంది. ఎప్పుడు రహదారి కూలిపోతుందోనన్న భయంతో వాహనదారులు ప్రయాణిస్తున్నారు. ఈ మార్గం మీదుగా జాతర్ల, అంద్‌గూడతో పాటు పరిసర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.

కోతకు గురై..

ఇచ్చోడ మండలంలోని దాబా(బి),(కె)కి వెళ్లే దారిలో రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పక్కభాగం మట్టి కొట్టుకుపోయి అంచు బలహీనంగా మారింది. ఈ దారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదం జరిగే అవకాశముంది. రాత్రివేళల్లో కోతకు గురైన ప్రాంతం సరిగా కనిపించడం లేదు.

బాలల రక్షణకు 1098 హెల్ప్‌లైన్

ముకోసం

ప్రస్తుత సమాజంలో పిల్లలపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పోక్సో కేసులు నమోదవుతున్నాయి. బాల్య వివాహాలు జరుగుతున్నాయి. బడిలో ఉండాల్సిన పిల్లలు పనిలో ఉంటున్నారు. ఇలా అనేక రకాలుగా బాలలు స్వేచ్ఛగా జీవించే హక్కును కోల్పోతున్నారు. ఇలాంటి తరుణంలో బాలలకు రక్షణ కల్పించాలని భారత ప్రభుత్వ మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రత్యేకమైన 1098 హెల్ప్‌లైన్ నంబరును అందుబాటులో ఉంచింది. ఇది పూర్తిగా ఉచితం. 24 గంటలు పని చేస్తుంది. కాల్ చేసిన వారి పేర్లు అత్యంత గోప్యంగా ఉంచుతారు.

● కాల్ అందిన 60 నిమిషాల లోపు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది చేరుకుంటారు.

● పోలీసులు, బాలల సంక్షేమ సమితి ప్రతినిధుల సహాయంతో పిల్లలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తారు.

● అవసరమైతే వైద్యం, వసతి కల్పిస్తారు. కౌన్సెలింగ్ నిర్వహించి పునరావాసం కల్పిస్తారు.

ఎలా పని చేస్తుందంటే

- హోటళ్లు, దుకాణాలు, ఇళ్లల్లో పనులు చేస్తున్న పిల్లలను రక్షించడానికి..
- 18 ఏళ్లలోపు బాలికలకు బలవంతంగా పెళ్లిళ్లు చేస్తుంటే ఆపడానికి
- ఇళ్లు, బడుల్లో, బయట లైంగిక వేధింపులు, శారీరక హింసకు గురవుతున్న పిల్లలకు..
- తల్లిదండ్రులు లేనివారు, ఇళ్లు వదిలి వచ్చేసినవారు, రహదారులపై యాచక వృత్తి చేసే బాలల కోసం..
- అక్రమ రవాణాకు, విక్రయానికి గురవుతున్న పిల్లలకు రక్షణ కల్పిస్తుంది.

- న్యూస్‌టుడే, భుక్తాపూర్

అభివృద్ధి.. కట్టతోనే ముడి

● ఖానాపూర్ చెరువు పునరుజ్జీవానికి అవాంతరాలు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం

ఎందరో మత్స్యకారులకు ఉపాధినిచ్చి.. భూగర్భజలాల పెంపునకు దోహదపడుతూ. . దశాబ్దాల చరిత్ర గల ఖానాపూర్ చెరువు పునరుజ్జీవనానికి అవాంతరాలు తప్పడం లేదు. దాదాపు 114 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులో ఆక్రమణలు పునరావృతం కాకుండా కట్ట నిర్మాణం చేసేందుకు అమృత్ 2.0 కింద రూ.3.16 కోట్లు మంజూరయ్యాయి. జనవరిలోనే టెండర్లు పూర్తికాగా ఏప్రిల్‌లో శంకుస్థాపన జరిగింది. ఆక్రమణలు తొలగించేందుకు పలుమార్లు అడ్డంకులు రాగా చివరకు మార్క్‌వేసి తొలగించాలని నిర్ణయించినా ఫలితం కనిపించడం లేదు. 700 మీటర్ల పొడవునా కట్టతోపాటు ఇరువైపులా రెయిలింగ్, 300 మీటర్ల నడకదారి పనులు చేపడతారు. డిసెంబరులోగా పని చేపట్టకుంటే కేంద్రం వాటా వెనక్కిపోయే అవకాశం ఉండటంతోనే ఇది తలనొప్పి వ్యవహారంగా మారింది.

పట్టణంలోని ఖానాపూర్ చెరువులో ఉన్న ఆక్రమణలు గుర్తించేందుకు పుర సిబ్బంది మార్క్ వేస్తున్న చిత్రమిది. ఆగస్టు 12న ఇలా 115 ఆక్రమణలున్నట్లు గుర్తించారు. ఇందులో శాశ్వత కట్టడాలు కొన్నే ఉన్నాయి. మరో చోట స్థలాలు ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి భరోసా ఇస్తున్నారు. కాకపోతే మార్క్‌వేసి పక్షం రోజులు గడుస్తున్నా ఎలాంటి ముందడుగు పడలేదు. ఇటు పని చేపట్టకపోతే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉండగా మున్ముందు చెరువు సుందరీకరణ పనులకు అడ్డుగా మారనుంది.

● అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.68 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపగా అందులో ఖానాపూర్ చెరువును జతచేశారు.

● పర్యాటక పరంగా తీర్చిదిద్దడానికి రూ.12 కోట్ల నిధులతో చెరువును సుందరీకరించనున్నారు.

● రూ.3 కోట్ల వ్యయంతో నీటిలో తేలియాడే హోటల్ నిర్మిస్తారు.

● రూ.21కోట్ల వ్యయంతో చెరువుపై 6 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కోసం సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తారు.

● ప్రస్తుతం బల్దియాకు నెలకు రూ.35లక్షల నుంచి రూ.42 లక్షల వరకు వచ్చే బిల్లు ఆదా కావడంతోపాటు విద్యుత్తు విక్రయించడంతో మరో రూ.15లక్షల వరకు ఆదాయం సమకూరనుంది. తొలుత కట్ట నిర్మాణం జరిగితేనే త్వరలో వచ్చే నిధులతో పనులకు అడ్డంకులు ఉండవు. అందుకనే కట్ట నిర్మాణం కీలకంగా మారుతోంది.

☛ ఈ విషయమై పట్టణ ప్రణాళిక విభాగం సూపర్‌వైజర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. ఆక్రమణ తొలగింపుపై ఉన్నతాధికారులకు నివేదించామని, ఆదేశాలు రాగానే తొలగిస్తామని వివరించారు.

క్యారం ఆడి.. ఉత్సాహం నింపి..

జిల్లా కేంద్రంలో సోమవారం కలెక్టర్ రాజర్షి షా ప్రణామ్ డే కేర్ సెంటర్‌ను సందర్శించారు. గోడలకు అతికించిన ఛాయాచిత్రాలను తిలకించి వాటి గురించి తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించారు. కాసేపు క్యారం ఆడారు. తనలో ఆట ఏమాత్రం తగ్గలేదన్నట్లుగా వరుసగా మూడు కాయిన్లు వేసి ఆశ్చర్యపరిచారు. వృద్ధులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మారుతున్న జీవన విధానంతో వయోవృద్ధులు ఒంటరితనానికి గురికాకుండా ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు 'ప్రణామ్' డే కేర్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, పుర కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, వయవృద్ధుల సమాఖ్య జిల్లా బాధ్యులు ఉన్నారు. - న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం

ఓపెన్‌స్కూల్ ప్రవేశాల గడువు పొడిగింపు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఓపెన్ స్కూల్ దూరవిద్య విధానంలో పదో తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ప్రవేశాల గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ మాధవి తెలిపారు. పదో తరగతికి ఓసీ పురుషులైతే రూ.1400, ఇతర వర్గాల వారు రూ.1000, అదే ఇంటర్ అయితే ఓసీ విభాగ పురుషులకు రూ.1500, ఇతరులకు రూ.1200లతో పాటు రిజిస్ట్రేషన్, ఆఫ్‌లైన్ ఛార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

MAHALAXMI B.Sc NURSING COLLEGE
Vill: Umdam, Mdl: Talamadugu, Dist: ADILABAD
WANTED: PRINCIPAL & TEACHING FACULTY
QUALIFICATION
1. M.Sc. NURSING
2. B.Sc NURSING
3. COMPUTER OPERATOR DEGREE ANY GROUP
COURSES OFFERED: 1. B.Sc NURSING 2. GNM NURSING
Contact: 8919260810, 8019275789
Venue: VIJAYA GNM NURSING COLLEGE
Ram Nagar, Adilabad
Date: 03-09-2026, Time: 10.00 AM To 4:00 PM

ఆదిలాబాద్ పట్టణంలో గతంలో కొందరు స్నేహితులు అర్ధరాత్రి వరకు మద్యం తాగి అతని వాహనం కాజేసే ఉద్దేశంతో ఇద్దరు స్నేహితులు కలిసి మరో స్నేహితుడిని హత్య చేసి చెరువులో పారేశారు. కాజేసిన ద్విచక్రవాహనాన్ని మహారాష్ట్రకు తరలించి విక్రయించారు.

అకారణంగా పట్టణంలో పట్టణంలో తిరుగుతూ కొందరు స్నేహితుల బృందం గంజాయి తాగుతూ అర్ధరాత్రి వరకు గడిపారు. అనంతరం వారి మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడటంతో మరో స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన ఘటన అప్పట్లో కలకలం సృష్టించింది. ఇలాంటి ఘటనలు, నేరాలను కట్టడి చేయటానికి ఆపరేషన్ చబుత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆకతాయిలపై చబుత్రాస్త్రం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే

యువత నేరాల బాట పట్టకుండా వారిని గాడిలో పెట్టేందుకు జిల్లా పోలీసు శాఖ 'ఆపరేషన్ చబుత్ర' కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. పట్టణంలో ఏక కాలంలో రాత్రుల్లో తనిఖీలు చేస్తోంది. వందలాది మంది పోలీసులు సోదాలు కొనసాగిస్తున్నారు. రాత్రి 11 గంటల అనంతరం యువత బయట తిరగకుండా ఉండేలా ఈ చర్యలు తీసుకుంటోంది. అత్యవసర పనులున్న వారు, ఆసుపత్రులకు వెళ్లే వారిని మినహాయించి ఎక్కడపడితే అక్కడ అరుగుల మీద, రహదారుల పక్కన బాతాఖానీ కొట్టే ఆకతాయిలను గుర్తిస్తూ వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వారి వేలి ముద్రలు సేకరించి రెండోసారి అదే విధంగా పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

☛ ఇందులో భాగంగా గంజాయి అక్రమ రవాణా, చోరీల నియంత్రణ, జూదం, మద్యం తాగి వాహనాలు నడిపే వారిని గుర్తిస్తున్నారు.

☛ యువత మద్యం, గంజాయి తాగి రాత్రి వేళల్లో అకారణంగా తిరుగుతూ నేరాలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావించి ఇలాంటి నేరాలను కట్టడి చేస్తున్నారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్ చేస్తున్న డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

మొదటి తప్పుగా కౌన్సెలింగ్

ఆపరేషన్ చబుత్ర తనిఖీల్లో ఇటీవల అర్ధరాత్రుల్లో పట్టుబడ్డ 400 మంది ఆకతాయిలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి విడుదల చేశారు. మొదటి తప్పుగా భావించి పంపించారు. రెండోసారి ఇలాగే అర్ధరాత్రి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

వేలాడే నియంత్రిక..

అధికారులు పట్టించుకోక

జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్ సమీపంలో నియంత్రిక ప్రమాదకరంగా మారింది. వారం రోజుల క్రితం వీచిన గాలివానకు నియంత్రిక గద్దె కూలిపోయి ప్రమాదకరంగా మారింది. స్తంభం అడ్డుగా ఉండడంతో కిందపడకుండా ఉంది. విద్యుత్తు అధికారులు చూసి వెళ్లిపోయారే తప్ప గద్దె ఏర్పాటు చేయలేదు. నియంత్రికకు త్రీఫేజ్ విద్యుత్తు సైతం ఉండడంతో అటువైపుగా వచ్చే వ్యవసాయదారులు భయాందోళనకు గురవుతున్నారు. నియంత్రికకు ఏ కొంచెం తగిలినా పశువులకు ప్రమాదం పొంచి ఉంది. - జైనథ్, న్యూస్‌టుడే

పింఛన్లకు 12,940 దరఖాస్తులు

● ఈ నెల 15 వరకు గడువు పొడిగింపు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే

ప్రభుత్వం నాలుగేళ్ల తరువాత కొత్త పింఛన్లకు అవకాశం కల్పించడంతో దరఖాస్తులు వెల్లువెత్తాయి. చేయూత పథకం కింద వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత కేటగిరీలకు జిల్లా వ్యాప్తంగా 12,940 దరఖాస్తులు వచ్చాయి. చాలా మందికి దరఖాస్తులకు జతపర్చాల్సిన పత్రాలు పొందేందుకు ఆలస్యం కావడంతో సకాలంలో దరఖాస్తు చేసుకోలేకపోయారు. దివ్యాంగులు సదరం ధ్రువీకరణ పత్రం కోసం జాప్యమవుతోంది. వారి వినతుల మేరకు ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. గత ప్రభుత్వ హయాం నుంచి దివ్యాంగులకు రూ.4016, ఇతరులకు రూ.2016చొప్పున ప్రతినెలా పింఛన్ డబ్బులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. 2022లో దరఖాస్తులను స్వీకరించినా మంజూరు చేయలేదు. దీంతో తాజాగా దరఖాస్తుదారుల సంఖ్య పెరిగింది. వృద్ధాప్య పింఛన్ దరఖాస్తులకు అనుమతించకపోవడంతో చాలా మంది నిరాశలో ఉన్నారు. 57 ఏళ్లు దాటిన వృద్ధులు వేలాది మంది పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు.

బల్దియాలో పింఛన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

దరఖాస్తులు కేటగిరీల వారీగా

వితంతు	ఒంటరి మహిళ	దివ్యాంగులు	చేనేత	కల్లుగీత
8,694	1,241	2,967	03	35

రైతేరాజు 6లో
ఉత్కంఠ నడుమ కోఆప్షన్ ఎన్నిక మరోసారి వాయిదా

నమూన ప్రకటన
బహిరంగ ప్రకటన
విజ్ఞతగల నిర్ణయం. వివాదాలకు అతీతం.
25% డిస్కౌంట్ కలదు
లక్షల విలువైన స్థిరాస్తిని కొనేముందు సరైన నిర్ణయం తీసుకోవడం అవసరం. 'ఈనాడు'లో బహిరంగ ప్రకటన ఇవ్వడం ఎంతో సులభం.
GST 5% Applicable
వివరాలకు: 80087 09949, 80087 09960
ఆదిలాబాద్: 91214 49286, నిర్మల్: 80087 09961, భైంసా: 80087 09957
మంచిర్యాల: 80087 09946, కుమురంభీం: 91549 92560

(c) eenadu

నువ్వు.. ప్రయోజనం బాగు

● వానాకాలం సాగు చేస్తే లాభాలు

మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : వానాకాలంలో ఆరుతడి పంటగా నువ్వు సాగు చేస్తే రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని నేలలు ఈ పంటకు అనుకూలమని.. దీనిని సాగు చేస్తే తక్కువ నీటితో గిట్టుబాటు ధర పొందవచ్చని వ్యవసాయ అధికారి అంజిత్‌కుమార్ వెల్లడించారు. వర్షాభావం వల్ల ఏ పంటలు సాగు చేయకపోతే త్వరగా వీటిని సాగు చేసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందే అవకాశముంది. ఇది 90 రోజుల పంట కావడంతో పాటు ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుంది.

నువ్వు పంట

సస్యరక్షణ చర్యలు ఇలా...

పేనుబంక : పంట వేసిన 25 రోజుల్లో ఈ పురుగు ఆశిస్తుంది. ఇది ఆశించిన చోట ఆకుల నుంచి తేనెలాంటి జిగురు పదార్థం విడుదల కావడం వల్ల ఆ పరిసరాల్లో చీమలు వస్తాయి. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటర్ల లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తామర పురుగులు, పచ్చదోమ : ఆకుల అడుగు భాగాన చేరి ఆకుల నుంచి రసాన్ని పీల్చివేస్తాయి. ఆకులు ముందుగా పాలిపోయి తర్వాతి దశలో ఎండిపోతాయి. తెల్లనల్లి ఆశిస్తే ముదురు ఆకుపచ్చ రంగుకు మారి ఈనెలు పొడవుగా కిందకు సాగి ముడుచుకుపోతాయి. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెల్లనల్లి నివారణకు డైకోఫాల్ 5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు

● వీటితో పాటు ఆకుముడత, కాయతొలిచే పురుగు, కోడు ఈగ, వేరుకుళ్లు, కాండం తెగుళ్లు, ఆకుమచ్చ, వెర్రి, బూడిద తెగులు వచ్చే అవకాశముంది. నివారణకు వ్యవసాయ అధికారుల సూచనతో చర్యలు చేపట్టాలి.

● పంట పసుపు రంగులోకి రాగానే కోసి కట్టలుగా కట్టి కిందకు వేలాడదీసి ఉంచాలి. వారం రోజులు ఎండిన తర్వాత నూర్పిడి చేయాలి. గింజలను 8 శాతం వరకు తేమ వచ్చే వరకు ఆరబెట్టి సంచుల్లో నిల్వ చేసుకోవచ్చు.

● **నేలల రకం :** తేలికైన నేలలు శ్రేష్ఠం. నీరు నిలిచే ఆమ్ల, క్షార గుణాలు కలిగిన నేలలు పనికిరావు. నేలను 2 నుంచి 4 సార్లు మెత్తగా దున్ని రెండు సార్లు గుంటుకతో చదును చేసుకోవాలి. ఎకరాకు 2.5 కిలోల విత్తనాన్ని వేయాలి.

● **విత్తే పద్ధతి :** వరుసల మధ్య దూరం 30 సెం.మీ, మొక్కల మధ్య 15 సెంటీమీటర్లు ఉండేలా చూసుకోవాలి.

● **రకాలు :** శ్వేత, హిమ(జేసీఎస్ 9456), రాజేశ్వరి, చందన, గౌరి, జేసీఎస్ 1020 అనుకూలం. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

● **ఎరువులు :** నత్రజని 25 కిలోలు(55 కిలోల యూరియా), భాస్వరం 8 కిలోలు(30 కిలోల సూపర్ పాస్ఫేట్), పొటాష్ 8 కిలోలు(14 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వేయాలి.

● **నీటి యాజమాన్యం :** విత్తిన వెంటనే పలుచటి తడి ఇవ్వాలి. తేమ ఎక్కువగా ఉండటం వల్ల మొక్కలు శాఖీయోత్పత్తి జరిగి ఆకులు, కొమ్మలు బాగా వచ్చి పూత, కాయ రాలకుండా ఉంటుంది.

● **కలుపు నివారణకు :** పెండిమిథాలిన్ ఎకరాకు ఒక లీటరు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సమావేశం నుంచి బయటకు వస్తున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లతో భాజపా కౌన్సిలర్లు

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్, భారాస, ఎంఐఎం కౌన్సిలర్లతో పుర ఛైర్‌పర్సన్ బండారి అనూష

ఉత్కంఠ నడుమ కోఆప్షన్ ఎన్నిక మరోసారి వాయిదా

ఫలించిన కూటమి ఎత్తుగడ

ఆదిలాబాద్ పట్టణం, ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ఉత్కంఠ నడుమ ఆదిలాబాద్ మున్సిపల్ కోఆప్షన్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. ముందుగా అనుకున్నట్లుగా కూటమి నేతలు వేసిన ఎత్తుగడ ఫలించినట్లు తెలుస్తోంది. గుర్రుగా ఉన్న భాజపా నేతలు ఈ విషయంపై కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

స్వతంత్రుల మద్దతుతో సరిపడా సంఖ్యాబలం ఉండటంతో భాజపా మొదటినుంచి తమదే విజయమని నమ్మకంతో ఉంది. ఇటు కూటమిగా ఏర్పడిన కాంగ్రెస్, భారాస, ఎంఐఎంకు చెందిన ముఖ్యనేతలు వాయిదా వేసేందుకు వ్యూహరచన చేస్తూ రావడం.. సమావేశం జరిగేలా భాజపా అధికారులపై ఒత్తిడి తీసుకు రావడంతోనే ఎన్నికకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. చివరకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి జోక్యం చేసుకొని అధికారులకు సూచనలిచ్చారనే ప్రచారం రాజకీయపరంగా వేడిపుట్టిచ్చింది.

40 నిమిషాలపాటు రగడ

మున్సిపల్ కార్యాలయంలో సమావేశం సరిగ్గా 3 గంటలకు ప్రారంభమైన వెంటనే కూటమి కౌన్సిలర్లు గళమెత్తారు. అభివృద్ధిపై ధ్యాస ఎందుకు లేదని భూకబ్జాలపై చర్చించాలని పట్టుబట్టారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌పై ఆరోపణలు సంధించారు. కూటమి కౌన్సిలర్లందరూ పోడియం వద్దకు దూసుకెళ్లడంతో అక్కడ రగడ నెలకొంది. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఛైర్‌పర్సన్ అనూష, పుర కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ వద్ద డిమాండ్ చేశారు. గతంలోనే భాజపా తాత్కాలిక ఛైర్‌పర్సన్‌ను కూర్చోబెట్టి ఎన్నిక చేపట్టాక మళ్లీ ఎన్నిక అని ఎందుకని అడుగుతున్నారని ప్రశ్నించారు. ఇలా దాదాపు 40 నిమిషాలపాటు సభ్యుల నినాదాలతో దద్దరిల్లింది. చివరకు ఛైర్‌పర్సన్ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో భాజపా ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఇతర కౌన్సిలర్లు కలిసి తాము బలపర్చిన నలుగురు కోఆప్షన్ సభ్యుల పేర్లతో పుర కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం పుర కార్యాలయ ప్రాంగణంలో కూటమి కౌన్సిలర్లు భూకబ్జాలపై ప్లకార్డులు ప్రదర్శించారు. భాజపా కూటమి నేతలు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. 51 మంది సభ్యుల్లో సమావేశానికి ఒక కాంగ్రెస్, ఒక ఎంఐఎం కౌన్సిలర్ గైర్హాజరయ్యారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్‌టౌన్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్లు సునీల్, నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

శాంతిభద్రతల దృష్ట్యా..

ముందుగా అభివృద్ధి, భూకబ్జాపై చర్చించి ఆ తరువాత కోఆప్షన్ ఎన్నిక నిర్వహించాలని తోటి సభ్యులు పట్టుబట్టారు. సమావేశం సజావుగా జరగాలని వారికి సూచించాం. సభ్యులు మాత్రం ప్రజల కోసం కూర్చున్నాం.. తొలుత ప్రజా సమస్యలపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. గందరగోళం నెలకొనడంతో అక్కడ సమావేశం నిర్వహించే వాతావరణం కనిపించలేదు. అందుకనే శాంతి భద్రతల దృష్ట్యా వాయిదా వేశాం. **- బండారి అనూష, ఛైర్‌పర్సన్**

కుట్ర పూరితంగానే..

సమస్యలను గత సమావేశాల్లో ఎందుకు ప్రస్తావించలేదు. భాజపాకు 27 మంది సంఖ్యాబలం ఉండడంతోనే కుట్రపూరితంగా వాయిదా వేశారు. మూడు పార్టీలు ఒక్కటయ్యాయి. మాజీ మంత్రి జోగురామన్న కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయి ఈ తతంగం నడిపించారు. రామన్న పదేళ్ల హయాంలో మున్సిపాల్టీలో జరిగిన అక్రమాలపై కోర్టుకు ఆధారాలు ఇస్తాం. ఎన్నిక వాయిదాపై న్యాయం కోసం కోర్టుకు వీడియో సమర్పిస్తాం. **- ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్**

వంకాయ.. లాభాలు తెచ్చెనయ్యా

సిరికొండ, న్యూస్‌టుడే: సంప్రదాయ పంటలు సోయా, పత్తితో నష్టాలు రావడంతో కూరగాయల సాగు వైపు మళ్లారు. సిరికొండ మండలం రాంపూర్(బి) గ్రామానికి చెందిన రైతు చెండె భావురావు వంకాయ సాగుతో మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. రెండేళ్లుగా రెండెకరాల్లో వంకాయ సాగు చేస్తున్న ఆయనకు దిగుబడి ఆశాజనకంగా వస్తోంది. మూడు నెలల కిందట సాగుచేసిన పంటకు మందుల పిచికారీ, కూలీలు, రవాణా, ఇతర ఖర్చులకు సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. ఇప్పటి వరకు పంట విక్రయాల ద్వారా రూ.3లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతు భావురావు తెలిపారు. రెండు నెలల పాటు పంట దిగుబడి వచ్చే అవకాశం ఉండటంతో మరో రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రైతు భావురావు చేనులో వంకాయ పంట

ఆదర్శం

☛ రెండేళ్లుగా వంకాయ సాగు చేస్తూ మంచి దిగుబడి సాధిస్తున్నారు. తక్కువ వ్యవధిలో పంట చేతికొచ్చింది. వారానికి రెండు సార్లు తెంపి మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇచ్చోడ, ఆదిలాబాద్ మార్కెట్‌లకు వంకాయలు తీసుకెళ్తున్నారు. ఒక్కసారి తెంపినప్పుడు 30 బుట్టలు వంకాయలను మార్కెట్‌కు తరలిస్తున్నట్లు రైతు తెలిపారు. ప్రస్తుతం ఒక్కో బుట్టకు రూ.600 ధర పలుకుతోందని చెప్పారు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

డా.పి.సాధ్వి, శాస్త్రవేత్త
బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి
చరవాణి సంఖ్య : 93811 81253

? ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు ఏ పంటలు సాగు చేసుకోవచ్చు? **- రమేష్, బెల్లంపల్లి**

✓: నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో మొక్కజొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు వంటి పంటలను సాగు చేసుకోవచ్చు. నువ్వులు, అలసంద, ఉలవలు, కూరగాయలను సాగు చేసుకోవచ్చు.

? : వరిపంటలో ఆకుముడత పురుగు సోకింది. నివారణ ఎలా? **- వెంకటేష్, నెన్నెల**

✓: పురుగు ఉద్ధృతి గమనిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ లేదా ఫ్లూబెండమైడ్ 0.1 మి.లీ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలుచు పురుగు సమస్య ఉన్న ప్రాంతాల్లో ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలి.

- న్యూస్‌టుడే, బెల్లంపల్లి పట్టణం

గొర్రెలకు నీలి నాలుక ముప్పు

మీకు తెలుసా?

వర్షాకాలం కావడంతో గొర్రెలకు నీలి నాలుక వ్యాధి ప్రబలే అవకాశం ఉంటుందని దీని పట్ల పెంపకందారులు జాగ్రత్తగా ఉండాలని మండల పశువైద్యాధికారి డా.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం దోమల బెడద ఎక్కువగా ఉండటం వల్ల వ్యాధికి ఎక్కువగా గురవుతాయని వెల్లడించారు. వ్యాధి సోకిన పది రోజులకు లక్షణాలు బయటపడతాయి. వ్యాధి సోకితే జీవాలు నీరసంగా కనిపిస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడతాయి. పాకలను శుభ్రంగా ఉంచాలి. పాక దగ్గర నీరు నిలవకుండా చూడాలి. దోమలు, ఇతర కీటకాల బారిన పడకుండా ఏర్పాట్లు చేసుకోవాలి. సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య వేపాకు లేదా కలబందను కాల్చి మంద లేదా పాక దగ్గర పొగ వేయడం ద్వారా కీటకాల బెడదను తగ్గించవచ్చు. అనారోగ్యానికి గురైన జీవాలను మంద నుంచి వేరు చేసి చికిత్స చేయించాలి. లేకుంటే మిగతా జీవాలకు వ్యాధి సోకే అవకాశముంటుంది. **- న్యూస్‌టుడే, దండేపల్లి**

తూము సాయిలు

ఆవుల గంగాధర్

తులసీరాం

తూము గౌరబాయి

దైవ దర్శనానికి వెళ్లి.. తిరిగిరాని లోకాలకు

కుభీరు, న్యూస్‌టుడే: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జీపు ముందు టైరు పేలి వాహనం బోల్తా పడడంతో కుభీరు మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దుర్మరణం పాలైన ఘటన మహారాష్ట్రలోని తోటంబ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రావణమాస సోమవారాన్ని పురస్కరించుకొని పార్డి(బి)కి చెందిన పదిమంది కలిసి ఒక జీపులో ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సమీపంలోని కైలాస్‌టేక్డి(శివాలయం) దేవాలయానికి దర్శనం కోసం వెళ్లారు. అక్కడి నుంచి మహారాష్ట్రలోని సాసర్‌కుండ్ వద్ద ఉన్న శివాలయాన్ని దర్శించుకొని తిరిగి వస్తుండగా.. మహారాష్ట్రలోని తోటంబ సమీపంలో జీపు ముందు టైరు పేలి అదుపుతప్పి వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో తూము సాయిలు(60), తూము గౌరబాయి(62), ఆవుల గంగాధర్(61) అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు క్షతగాత్రులను భైంసా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వాహన చోదకుడు దాహెగాం తులసీరాం(26) మృతిచెందారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నియంత్రికల దొంగల ముఠా అరెస్టు

250 కేజీల రాగి తీగ, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం

నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ సాయికిరణ్, పక్కన సీఐలు

భైంసా, న్యూస్‌టుడే : భైంసా డివిజన్‌లో విద్యుత్తు నియంత్రికలే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడిన ముఠాను ముథోల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం పట్టణ ఠాణాలో నిందితులను ప్రవేశపెట్టిన ఏఎస్పీ సాయికిరణ్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన షెడికే గణేశ్, గంటల్‌వాడ్ సాయినాథ్(ఎలక్ట్రీషియన్), నక్కల్‌వాడ్ గణేశ్, రత్నెల్లి గజానంద్, ఘూగ్రే దీపక్, భైంసా పట్టణానికి చెందిన పిట్లొల్ల పోశెట్టి(ఎలక్ట్రీషియన్)తోపాటు ఓ మైనర్ బాలుడు జల్సాల కోసం ఎనిమిది నెలలుగా డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు నియంత్రికలు ధ్వంసం చేసి అందులోని రాగి తీగలు దొంగలించారు. వీరిపై ముథోల్, తానూరు, కుభీరు, బాసర, కుంటాల, భైంసా పట్టణం, గ్రామీణ ఠాణాల్లో 33కేసులు నమోదయ్యాయి. ఎస్పీ డా.జి.జానకి షర్మిల నేతృత్వంలో నియంత్రికల దొంగలను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ముథోల్ పోలీసులు ఏడుగురిని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకొన్నారు. వారి నుంచి 250కేజీల రాగి తీగలు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఏడు చరవాణులు, దొంగతనాలు వినియోగించిన కటింగ్ ప్లేయర్, దబ్బనం ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న ముథోల్, బాసర సీఐలు రవీందర్ నాయక్, దీపక్, ముథోల్, తానూరు ఎస్సైలు బి.పెర్సిస్, షేక్ జుబేర్, ఏఎస్సై నర్సింగ్ భాను, సిబ్బంది రాజేందర్, అమర్‌నాథ్, పోతన్న, గజేందర్, వెంకటసాయి, నరేంద్రచారి, గగన్, సందీప్, వెంకట్‌రావును ఏఎస్పీ అభినందించారు.

అటవీ ప్రాంతంలో విరివిగా పెరిగిన పుట్ట గొడుగులు

సహ్యాద్రిపై 'సహజ' పుట్ట గొడుగులు

సారంగాపూర్, న్యూస్‌టుడే : ఎక్కువ పోషకాలుండే పుట్టగొడుగులు తినడానికి చాలా మంది ఇష్టపడుతుంటారు. నిర్మల్-ఆదిలాబాద్ జిల్లాల సరిహద్దుగా ఉన్న సహ్యాద్రి పర్వతాలపై ప్రకృతి ఒడిలో సహజ సిద్ధంగా పెరిగిన పుట్టగొడుగులు లభ్యమయ్యాయి. సోమవారం క్షేత్ర పర్యటనకు వెళ్లిన సారంగాపూర్ ఉప అటవీ క్షేత్రాధికారి మహ్మద్ నజీర్‌ఖాన్ వాటిని గుర్తించారు. రొయ్య, కోడికూర, చీమ, తెల్ల, చెదల పుట్ట గొడుగులుగా స్థానికంగా వీటిని పిలుస్తుంటారు. టెర్మిటోమైసెస్ మైక్రోకార్పస్ శాస్త్రీయ నామం కలిగిన లయోఫిల్లాసియో కుటుంబానికి చెందిన ఇవి ఆకురాల్చే అడవులు, వెదురు మొదళ్లల్లో వద్ద పెరుగుతుంటాయని ఆయన తెలిపారు.

ఎస్టీపీపీ వో అండ్ ఎం నిర్వహణపై గందరగోళం!

జైపూర్, న్యూస్‌టుడే: జైపూర్ మండలం పెగడపల్లి సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం వోఅండ్‌ఎం(ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్) బాధ్యతలపై ఉత్కంఠ నెలకొనగా కార్మిక వర్గం గందరగోళానికి గురవుతోంది. ఎస్టీపీపీలో 600 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్ల వోఅండ్‌ఎం బాధ్యతలను 2021 జూన్‌లో పవర్‌మేక్ సంస్థ 7 సంవత్సరాలకు (రెండేళ్ల ఎక్స్‌టెన్షన్ కలుపుకొని) దక్కించుకోగా.. ఈఏడాది మేలో 5ఏళ్లు పూర్తి చేసుకుంది. ప్రస్తుతం అన్ని ఖర్చులు కలుపుకొని ప్రతి నెలా పవర్‌మేక్ సంస్థకు నిర్వహణ కింద సింగరేణి యాజమాన్యం రూ.7కోట్ల పైచిలుకు చెల్లిస్తోంది. మరో రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ ఇంతకంటే తక్కువ ధరకు వోఅండ్‌ఎం బాధ్యతలు చేపట్టేందుకు ఇతర సంస్థలు ఆసక్తి చూపుతాయనే కోణంలో యాజమాన్యం కొన్నినెలల కిందట టెండర్లు పిలిచింది. కొన్ని సంస్థలు పోటీ పడగా ఇటీవల విడుదల చేసిన టెండర్‌లోనూ ఎల్-1గా పవర్‌మేక్ సంస్థ నిలిచింది. ప్రస్తుతం చెల్లించే ధర కంటే నూతన టెండర్ ద్వారా ఎక్కువ సొమ్ము చెల్లించాల్సి రావడంతో యాజమాన్యం ఆలోచనలో పడినట్లు సమాచారం. మూడు నెలల పొడిగింపుతో సోమవారం(ఆగస్టు 31) వరకే పవర్‌మేక్ నిర్వహణ బాధ్యతలు చేపట్టనుంది. సోమవారం కార్మికుల గేట్ పాస్‌ల గడువు పూర్తికావడంతో గందరగోళం నెలకొంది. టెండర్ గురించి సోమవారం సాయంత్రం వరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు లేకపోగా.. కొన్ని కార్మిక సంఘాలకు వారం వరకు పాస్‌ల గడువు పొడిగించాలని మౌఖిక ఆదేశాలు అందినట్లు తెలిసింది. పాస్‌ల విషయంలో ఆందోళన చెందకుండా పాతవాటితోనే విధులకు హాజరు కావాలని పలు కార్మిక సంఘాలు సామాజిక మాధ్యమాల ద్వారా విషయాన్ని తెలియజేశాయి. ఈ విషయమై ఎస్టీపీపీ ఈడీ చిరంజీవిని వివరణ కోరగా... నిర్వహణ బాధ్యతలను పవర్‌మేక్ సంస్థకే అప్పగించామని, ప్రక్రియ రెండు వారాల కిందటే పూర్తయిందని చెప్పారు. గేట్‌పాస్‌ల విషయంలో కార్మికులు ఆందోళన చెందవద్దని తెలిపారు.

సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం

మారథాన్‌లో ఇందారం యువకుల ప్రతిభ

జైపూర్, న్యూస్‌టుడే : హైదరాబాద్ రన్నర్స్, ఎన్ఎండీసీ సంయుక్తంగా ఆదివారం హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో నిర్వహించిన మారథాన్-15వ ఎడిషన్‌లో ఇందారం యువకులు ప్రతిభ కనబరిచారు. 42.95 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌లో సంకటి సంతోష్, 21.95 కిలోమీటర్ల ఆఫ్ మారథాన్‌లో అరికె సంతోష్ ప్రతిభ చూపారు. కాగా వీరిద్దరు గతంలోనూ పలు మారథాన్‌లో పాల్గొని ప్రశంసలు అందుకున్నారు.

మారథాన్‌లో ప్రతిభ చూపిన అరికె సంతోష్, సంకటి సంతోష్

మంచిర్యాలలో కేంద్రీకృత వంటశాల ప్రారంభం

విద్యార్థులతో కలిసి అల్పాహారం తింటున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్‌దీపక్, డీసీపీ భాస్కర్

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే : తెలంగాణ స్కూల్ బ్రేక్ ఫాస్ట్ ప్రోగ్రాంలో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం కేంద్రీకృత వంటశాలను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్, సింగరేణి భాగస్వామ్యంతో ఏర్పాటైన వంటశాలలో మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని 691 ప్రభుత్వ పాఠశాలలు, 13 జూనియర్ కళాశాలలకు చెందిన 49,109 మంది విద్యార్థులకు రోజూ రుచికరమైన, పరిశుభ్రమైన అల్పాహారం ఆరంభమైంది. ఈ తయారీ విధానాన్ని ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, సింగరేణి అధికారులు పర్యవేక్షించారు. అనంతరం పద్మనాయక కల్యాణ మండపంలో విద్యార్థులతో అతిథులు అల్పాహారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఏ విద్యార్థి అర్థాకలితో బడికి వెళ్లకూడదనేది ప్రజా ప్రభుత్వం సంకల్పమన్నారు. డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, సింగరేణి అధికారులు రాధాకృష్ణ, ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, ఛారిటబుల్ ప్రతినిధులు సత్య గౌరచంద్ర దాస, కాంతేయ దాస, నగర మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, తదితరులున్నారు.

EENADU e Classifieds

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Nutula PetaRamreddy S/o. Nutula Bhojareddy (Oldname) R/o. H.No 3-77, Vill: Madhapur, Mdl: Soan, Dist. Nirmal. TS havechanged myname as Nutula Ramreddy S/o. Nuthula Bhoja Reddy (New name).

REAL ESTATE

బ్యాంక్ సీజ్ చేసిన ఓపెన్ ప్లాట్స్ మరియు ఇండివిడ్యువల్ హౌసెస్ అమ్మకానికి కలవు. ఆసక్తి కలవారు సంప్రః 8886068456 (శ్యామ్).

JOBS

Staff Required For CCTV Cameras Installation & Servicing in Mancherial. Lorven I Zone CCTV Cameras. 94404 84878.

మంచిర్యాలలో త్వరలో ప్రారంభం కాబోతున్న షాపింగ్‌మాల్‌లో పని చేయుటకు సేల్స్‌బాయ్స్ మరియు సేల్స్ గర్ల్స్ కావలెను. Cell: 83090 34069.

రాఘవ అసెట్ ఫైనాన్స్ ప్రై.లి.లో చేయుటకు అభ్యర్థులు కావలెను. బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్-11, జీ: 16K-18K. & షోరూం ఎగ్జిక్యూటివ్స్-03, జీ: 15 K. Locations: ఆదిలాబాద్, నిర్మల్, లక్షెట్టిపేట్, మంచిర్యాల, కాగజ్‌నగర్. Cont. 7337551744/705

శ్రీరామ్ అకాడమీకి ఇంటి వద్ద నుండి ప్రాజెక్టు వర్క్ చేయుటకు ఫోన్ ఉన్న వారు కావలెను. అ:10th, జీ:20k శిక్షణ రుసుము కలదు. సెల్: 8886977750.

Book Your 5 Lines Classified Advertisement for
B & W Rs. 300/- Only
Colour Rs. 350/- Only
GST 5% Applicable in Classifieds on any day
For further details Contact:
Adilabad: 80087 09949 90005 66042

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకుందాం

అమర వీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న వీర తెలంగాణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, సభ్యులు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: ఆదివాసీ అమర వీరుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్తామని వీర తెలంగాణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి అన్నారు. సోమవారం ఇంద్రవెల్లిలో అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి, జాగో తెలంగాణ యాత్రకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని కాపాడుకుందామన్నారు. కుల, మత, రాజకీయాలను వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. యువత, మహిళలు, రైతులు, పేద, మధ్య తరగతి ప్రజలను రాజకీయాల్లోకి ఆహ్వానించడమే లక్ష్యమన్నారు. ఇంద్రవెల్లి నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల కిలోమీటర్ల వరకు కొనసాగుతుందన్నారు. పల్లెల్లో నెల కొన్న సమస్యలను తెలుసుకుంటామని పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ముగింపు పలుకుతామన్నారు. అనంతరం కేస్లాపూర్ గ్రామానికి వెళ్లి ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబాను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజన, వివేక్, అమూల్య, సుమన్, సతీష్, దిలీప్, గురువయ్య, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

సీఈఓలుగా పదోన్నతి

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది మందికి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)లుగా పదోన్నతి లభించింది. ప్రస్తుతం డిప్యూటీ సీఈఓ హోదాలో ఉన్న వీరికి ఇక సీఈఓగా హోదా కల్పించనున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాపరిషత్ డిప్యూటీ సీఈఓగా పనిచేస్తున్న ఆర్.లక్ష్మీనారాయణ, ఆదిలాబాద్ గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ)గా పనిచేస్తున్న రవీందర్‌రాఠోడ్ పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

తొలి మావోయిస్టు మహిళా నేత కన్నుమూత

ఈటీవీ-ఆదిలాబాద్, న్యూస్‌టుడే, ఎదులాపురం: తెలంగాణ తొలి మావోయిస్టు ఆదివాసీ మహిళ, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న సతీమణి కుర్సెంజ్ మోతీబాయి అలియాస్ రాధక్క(55) అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. మూడురోజుల కిందట ఆదిలాబాద్ రిమ్స్‌లో చేరిన ఆమె సోమవారం సాయంత్రం గుండెపోటుతో తుదిశ్వాస వదిలారు. ఆమె స్వస్థలం ఆదిలాబాద్ గ్రామీణ మండలం పిప్పల్‌ధరి. బాల్యం నుంచే ఆదివాసీ హక్కుల కోసం నినదించిన ఆమె 1984లో పీపుల్స్‌వార్‌లో చేరారు. దళసభ్యురాలి నుంచి రాష్ట్ర కమిటీ బాధ్యతల నిర్వహణ వరకు ఆమె ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. విప్లవోద్యమ కార్యకలాపాలు, కార్యక్రమాల అవసరాలరీత్యా పార్టీ ఆమెను 1998లో ఛత్తీస్‌గఢ్‌కు బదిలీ చేసింది. అక్కడ ఆదివాసీలను సంఘటితం చేయటంలో చురుకైన పాత్ర పోషించారు. 2017లో అనారోగ్యం కారణంగా ఆసుపత్రికి వెళ్తుండగా ఆమె ప్రయాణిస్తున్న వాహనం ఖమ్మం దగ్గర వెంటాడుతున్న పోలీసులను తప్పించే క్రమంలో బోల్తాపడింది. గాయాలతో బయటపడి పోలీసులకు పట్టుబడిన ఆమె నాలుగేళ్లపాటు జైలు జీవితం గడిపారు. ఆ తర్వాత ఆమెపై ఉన్న కేసులను కోర్టు కొట్టివేసింది. గతేడాది నవంబరులో చంద్రన్న ఉద్యమం నుంచి బయటకు వచ్చిన తర్వాత ఇద్దరు కలిసి రామగుండంలో ఉంటున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో పిప్పల్‌ధరికి వచ్చిన ఆమె మూడురోజుల కిందట రిమ్స్‌లో చేరారు. మంగళవారం మధ్యాహ్నం లింగుగూడలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. ఆమె మృతిపై ప్రజాసంఘాల బాధ్యులు, వామపక్షవాదులు నివాళులర్పించారు.

రాధక్క

గ్రామీణుల సేవల్లో ఐపీపీబీ

న్యూస్‌టుడే, భుక్తాపూర్:

పోటీ ప్రపంచంలో అన్ని బ్యాంకులకు దీటుగా మెరుగైన సేవలు అందించాలని భారత ప్రభుత్వం తపాలా శాఖ ఆధ్వర్యంలో 2018లో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్(ఐపీపీబీ)ను ప్రారంభించింది. బ్యాంకులు అందుబాటులో లేని గ్రామీణ ప్రాంతాల వారికి సులభంగా బ్యాంకింగ్ సేవలు అందిస్తోంది. దేశంలోని ప్రముఖ కంపెనీలతో కలిసి ప్రమాద బీమా పాలసీలను ప్రవేశపెట్టింది. మంగళవారం తొమ్మిదో సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా కథనం.

- ☛ జీరో బ్యాలెన్స్‌తో ఖాతా తెరవవచ్చు.
- ☛ బ్యాంకులో గరిష్ఠంగా రూ.2లక్షల వరకు బ్యాలెన్స్ ఉంచుకోవచ్చు.
- ☛ ఐపీపీబీ మొబైల్ యాప్ ద్వారా సులభంగా డబ్బులు పంపవచ్చు.
- ☛ ఐపీపీబీ మొబైల్ యాప్ ద్వారా కరెంటు, గ్యాస్, డీటీహెచ్, రీఛార్జ్‌లు చేసుకోవచ్చు.
- ☛ గ్యాస్ రాయితీ, పీఎం కిసాన్ వంటి ప్రభుత్వ పథకాల డబ్బులు నేరుగా ఐపీపీబీ ఖాతాలో జమ అవుతుంది.

ఉమ్మడి జిల్లాలో వివరాలు

- ☛ ఐపీపీబీ ఖాతాలు : 6 లక్షలు
- ☛ ప్రమాద బీమా పాలసీలు : 50 వేలు
- ☛ ప్రమాద బీమా పాలసీ క్లెయిమ్‌లు : రూ.2 కోట్లు
- ☛ బాల ఆధార్ నమోదు : 10 వేలు
- ☛ ఆధార్ మొబైల్ నవీకరణ : 20 వేలు

తరోడ గ్రామానికి చెందిన లక్ష్మణ్ రూ.549తో ఆదిత్య బిర్లా ప్రమాద బీమా పాలసీ చేసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో ట్రాక్టరు బోల్తా పడి ఆయన మరణించారు. నామినీగా ఆయన భార్య భూమిబాయికి రూ.10 లక్షలు చెక్కును కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా ఐపీపీబీ తపాలా సిబ్బంది, ఆదిత్య బిర్లా సిబ్బంది అందించారు.

అంతర్ జిల్లాల స్థాయి పోటీల్లో మనోళ్లకు కాంస్యం

కాంస్య పతకం సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ బాలికల జట్టు క్రీడాకారులు

రెబ్బెన, న్యూస్‌టుడే: మెదక్ జిల్లాలో గత నెల 28-30 వరకు జరిగిన అంతర్ జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ బాలికల జట్టు కాంస్య పతకం సాధించింది. సెమీ ఫైనల్‌లో వరంగల్ జట్టుపై 35-33, 35-32 పాయింట్ల తేడాతో ఓడింది. మూడో స్థానంలో నిజామాబాద్ జట్టుపై 35-25, 35-28 స్కోర్ చేసి గెలుపొంది కాంస్య పతకాన్ని సాధించినట్లు ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు డా.కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతిలు తెలిపారు. పురుషుల జట్టు హైదరాబాద్‌పై ఓటమి పాలై నాలుగో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పతకాన్ని సాధించిన జిల్లా జట్టును జిల్లా ఒలింపిక్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లు మహేందర్, భాస్కర్, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంయుక్త కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు అభినందించారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155, తలమడుగు: 9989120742
బోథ్: 91548 46671, ఉట్నూరు: 94410 86640

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

స్పందనకు వందనం

నేరడిగొండ, న్యూస్‌టుడే: నేరడిగొండ గ్రామ పంచాయతీలో గత కొన్ని నెలలుగా దోమల ఫాగింగ్ యంత్రం పని చేయడం లేదు. ఈ సమస్యపై ఆగస్టు 17వ తేదీన 'పుడుతున్నాయి.. కుడుతున్నాయి' శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన సర్పంచి నీలిమా రెడ్డి నూతన దోమల ఫాగింగ్ యంత్రం తెప్పించి సోమవారం గ్రామంలోని పలు కాలనీల్లో దోమల మందు పిచికారీ చేయించారు. దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని సర్పంచి నీలిమా రెడ్డి తెలిపారు.

మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

జీవితంలో ఉన్నత లక్ష్యాలు పెట్టుకోవాలి

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: జీవితంలో ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని ఆ దిశగా ముందుకు సాగాలని ఎస్పీ అఖిల్ మహాజన్ విద్యార్థులకు సూచించారు. పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకులంలో విద్యార్థులకు నిర్వహించిన షీ టీం అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్తును మార్చేది విద్య ఒక్కటేనని తెలిపారు. మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాండు, రైల్వే స్టేషన్, రోడ్డుపైన ఇతర ప్రాంతాల్లో ర్యాగింగ్ గాని, ఈవ్ టీజింగ్ గాని, మహిళలపై వేధింపులు, సామాజిక మాధ్యమం ద్వారా వేధింపులు ఎదురైతే భయపడకుండా వెంటనే షీ టీంకు గాని, పోలీసులను సంప్రదించాలని సూచించారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఎండబ్ల్యూఓ కలీం, మావల సీఐ ప్రేమ్ కుమార్, ఎస్సై రాజశేఖర్ రెడ్డి, ప్రిన్సిపల్ మాధురి, షీ టీం బృందం సభ్యులు సుశీల, వాణిశ్రీ, పోలీసు అక్క ఏఎస్సై జయలక్ష్మి ఉన్నారు.

ఆదిలాబాద్ గ్రామీణం: మావల మండలంలోని బట్టిసావర్‌గావ్‌లో సోమవారం నిర్వహించిన పోలీసులు - మీకోసం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరయ్యారు. బట్టిసావర్‌గావ్‌లో 11, వాఘాపూర్ గ్రామంలో 9 సీసీటీవీ కెమెరాలు ప్రారంభించారు. నేరాలు నియంత్రించడంలో సీసీటీవీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, మావల సీఐ బి.డి.ప్రేమ్‌కుమార్, సర్పంచి శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రజా ఫిర్యాదుల విభాగానికి 23 అర్జీలు

ఆదిలాబాద్ నేర విభాగం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి జిల్లాలోని నలుమూలల నుంచి 23 మంది అర్జీదారులు తరలివచ్చారు. వారి సమస్యలు తెలుసుకున్న ఎస్పీ అఖిల్ మహాజన్ అప్పటికప్పుడే సంబంధిత పోలీసు అధికారులతో చరవాణిలో మాట్లాడుతూ బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ నెలాఖరు వరకు జిల్లాలో పోలీసు యాక్ట్

ఆదిలాబాద్ నేర విభాగం: ఈ నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు.

హజ్ యాత్ర పేరిట రూ.11 లక్షల కాజేత

ఆదిలాబాద్ నేర విభాగం: హజ్ యాత్ర పేరిట రూ.11 లక్షలు కాజేసిన ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.సునిల్‌కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కలగూడకు చెందిన షేక్ సద్దాం తన స్నేహితుడితో కలిసి హజ్ యాత్ర-2026కు వెళ్లటానికి ఏజెంట్లను సంప్రదించారు. ట్రావెల్ ఏజెంట్లు నిర్మల్ జిల్లా తిమ్మాపూర్‌కు చెందిన ముదాసిర్ అహ్మద్, మొహ్మద్ యూనూస్ షేక్‌తో రూ.42 లక్షలకు ఒప్పందం చేసుకొని చెల్లించారు. టికెట్లు రాకపోవటంతో బాధితులు నేరుగా గోల్డెన్ ట్రావెల్స్‌ను సంప్రదించగా ఏజెంట్లు రూ.11లక్షలు చెల్లించలేదని తెలిసింది. బాధితులు ట్రావెల్స్‌కు డబ్బులు చెల్లించి హజ్ యాత్ర పూర్తి చేసుకున్నారు. తిరిగి వచ్చాక డబ్బుల గురించి ఏజెంట్లను ప్రశ్నిస్తే వారు వాయిదాలు వేస్తూ వస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మోసం కేసులో నిందితుడు ముదాసిర్ అహ్మద్‌ను అరెస్టు చేశామన్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం

బోథ్, న్యూస్‌టుడే: అడవి పందులు దాడిలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట తీవ్రంగా నాశనమైంది. బోథ్ మండలంలోని మందబొగడ గ్రామపంచాయతీ పరిధిలోని రఘునాథ్‌పూర్ గ్రామానికి చెందిన రాఠోడ్ దూద్‌రాం అనే రైతు అయిదు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ఆదివారం రాత్రి అడవి పందులు పంట పొలంపై దాడి చేసి రెండెకరాల్లోని పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి.

బజార్‌హత్నూర్: అడవిపందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసమైన ఘటన బజార్‌హత్నూర్‌లో చోటుచేసుకుంది. స్థానిక రైతు కీర్తి చంద్రశేఖర్ 7 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేస్తున్నారు. ఆదివారం రాత్రి పందుల గుంపు సుమారు 3.5 ఎకరాల్లో పంటను నష్టపరిచాయన్నారు.

దుకాణంలో చోరీ

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌లో బి.రాములు కాంప్లెక్స్ సమీపంలోని దుకాణంలో సోమవారం తెల్లవారుజామున చోరీ ఘటన చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ బి.సునిల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. తెల్లవారు జామున అయిదు గంటల ప్రాంతంలో ఇద్దరు దుండగులు దుకాణంలోకి చొరబడి రూ.60వేల నగదు, రూ.1.20 లక్షల విలువైన సిగరెట్లను తస్కరించినట్లు పేర్కొన్నారు. బాధితుడు షేక్ ఇఫ్తెకార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అంతర్రాష్ట్ర రహదారికి మరమ్మతులు

తలమడుగు, న్యూస్‌టుడే: మండలంలోని సుంకిడి, ఖోడద్, తాంసి మండలంలోని పొన్నారి అంతర్రాష్ట్ర రహదారికి సోమవారం మరమ్మతులు ప్రారంభమయ్యాయి. ఇటీవల 23 కి.మీ. ముప్పుతిప్పలు శీర్షికన 'ఈనాడు' మినీలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దారి పొడవునా ఏర్పడిన గుంతల్లో కంకర వేసి గోతులు పూడ్చివేయిస్తున్నారు. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారిలో గుంతల ఇబ్బందులు ఎట్టకేలకు దూరం కానున్నాయి.

పాముకాటుతో గిరిజన యువకుడి మృతి

సందీప్

తలమడుగు, న్యూస్‌టుడే: మండలంలోని పాత నంది గామ గ్రామానికి చెందిన కనక సందీప్ (25) పాముకాటుకు గురై సోమవారం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై రాధిక, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. సందీప్ తనకున్న 2 ఎకరాల సాగుభూమితో పాటు మరో 2 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఆదివారం పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చాడు. భోజనం చేసిన తర్వాత ఇంట్లో నేలపై నిద్రపోయాడు వేకువజామున 4 గంటల సమయంలో పాము కాటు వేసింది. విషయాన్ని కుటుంబీకులకు వివరించి చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు వెళ్లాడు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన బస్సు..

రెబ్బెన, న్యూస్‌టుడే: నవేగాం బస్టాండ్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యారు. ఎస్సై ఎ.వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కెరమెరి మండలం ఇందాపూర్ గ్రామానికి చెందిన వడై మునేశ్వర్(28) ద్విచక్రవాహనంపై సోమవారం రాత్రి కాగజ్‌నగర్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సు బెజ్జూరు వైపు వెళ్తోంది. నవేగాం గ్రామ శివారులోకి చేరుకోగానే ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొట్టింది. మునేశ్వర్ అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలానికి చెందిన డ్రైవర్ ఎండీఖాన్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టినట్లు తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సమస్యలు విని.. భరోసానిచ్చి

దివ్యాంగుల సమస్యలు వింటున్న కలెక్టర్ రాజర్షి షా

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం అర్జీదారులు పోటెత్తారు. సమస్యలు చెప్పేందుకు బారులు తీరారు. కలెక్టర్ రాజర్షిషా వారి నుంచి విజ్ఞప్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. అందుబాటులో ఉన్న అధికారులను పిలిచి అప్పటికప్పుడే ఆదేశాలు ఇచ్చారు. అర్జీలు అందించిన ప్రజల సమస్యలు ఇలా ఉన్నాయి.

ఉద్యోగ అవకాశాలు కల్పించండి

ప్రతిపాదిత విమానాశ్రయం కింద భూములు కోల్పోతున్న తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కచ్‌కంటి గ్రామ నిర్వాసితులు కోరారు. జీవనాధారంగా ఉన్న భూములు కోల్పోతున్న తమకు తగినంత పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సర్వేలో హెచ్చు తగ్గులను సవరించాలని కోరారు. గ్రామసభ నిర్వహించి తగు న్యాయం చేస్తామని కలెక్టర్ భరోసానిచ్చారు.

కనీస సౌకర్యాలు లేక అవస్థలు

జిల్లా కేంద్రానికి కేవలం 8 కి.మీ. దూరంలో నివసిస్తున్న తమకు రహదారి, విద్యుత్తు, తాగునీరు, విద్యా వసతులు లేక అవస్థలు పడుతున్నామని నిషాన్‌ఘాట్ వాసులు వాపోయారు. ఏళ్లుగా నివసిస్తున్న గుడిసెలకు పట్టాలు, ఇంటిపన్నుగానీ తీసుకోవడం లేదన్నారు. ఆయా ప్రభుత్వ పథకాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పబ్లిక్ టాయిలెట్ల పనులు నిలిపేయరూ

నివాస ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణంతో ఇబ్బందులు తలెత్తుతాయని ఆదిలాబాద్ పట్టణం బొక్కల్‌గూడ, హరిజనవాడ కాలనీవాసులు వాపోయారు. ఆ పనులు నిలిపేయాలన్నారు. కాలనీలో 90 శాతానికిపైగా ఇళ్లలో టాయిలెట్లు ఉన్నాయని, మిగిలిన వారికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి టాయిలెట్లు నిర్మిస్తున్నారని గుర్తుచేశారు.

అర్జీలు వెంటనే పరిష్కరించండి

ఉట్నూరు గ్రామీణం: అర్జీదారుల దరఖాస్తులు పరిశీలించి అర్హమైన వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను పీవో మంద మకరందు ఆదేశించారు. ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఉమ్మడి జిల్లా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు పీవోకు వినతి పత్రాలు అందించి సమస్యలు విన్నవించారు. ఉట్నూరుకు చెందిన కుర్సెంగ మహేశ్ ల్యాప్‌టాప్ కావాలని, గుడిహత్నూరు మండలం తోషం గ్రామానికి చెందిన మెస్రం శ్రీను బ్లడ్‌క్యాన్సర్ చికిత్స కోసం ఆర్థిక సాయం అందించాలని విన్నవించారు.

భాజపా మహా దీక్షను విజయవంతం చేయండి

ఉట్నూరు గ్రామీణం,న్యూస్‌టుడే: భూముల పేరుతో జరుగుతున్న అక్రమాలను నిరసిస్తూ సెప్టెంబరు 5,6 తేదీలలో బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టనున్న మహా దీక్షను విజయవంతం చేయాలని భాజపా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాఠోడ్ పిలుపునిచ్చారు. ఉట్నూరులోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు బింగి వెంకటేష్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, శ్రీకాంత్, రాఠోడ్ శేషారావ్, రవీందర్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడుల పేరుతో రూ.కోట్లలో బురిడీ

ఆదిలాబాద్ నేర విభాగం: ఆదిలాబాద్‌కు చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి పెట్టుబడుల పేరుతో పలువురి వద్ద నుంచి డబ్బులు తీసుకొని రూ.కోట్లలో మోసం చేసినట్లు సమాచారం. హైదరాబాద్‌లో స్థిరాస్తి వ్యాపారం అంటూ ఆదిలాబాద్‌కు చెందిన పలువురి నుంచి రూ.లక్షల్లో తీసుకున్నాడని సమాచారం. రూ.పది లక్షలు పెట్టుబడులు పెట్టిన వారికి కొన్నాళ్లకు మరో రూ.రెండు, మూడు లక్షలు కలిపి ఇచ్చాడు. దీంతో పలువురు నమ్మి రూ.లక్షల్లో అతనికి ఇచ్చినట్లు తెలిసింది. ఇలా కోట్ల రూపాయలు తీసుకొని మోసం చేసినట్లు తెలిసింది. కొందరు బాధితులు జిల్లా స్థాయి పోలీసు అధికారులను కలిసి విషయాన్ని దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది

ఘనంగా విముక్త జాతుల దినోత్సవం

ఆదిలాబాద్ గ్రామీణం: జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సోమవారం బీసీ సంచార జాతుల విముక్త దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ రాజేశ్వర్ హాజరై మాట్లాడారు. సంచార జాతుల విముక్తి, వారి జీవితంలో ఏర్పడుతున్న సమస్యల గురించి వివరించారు. 51 జాతులు ఇంకా వెనుకబడి సంచార జాతులుగా ఉన్నాయని, వీరికి చదువుతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సునిత, బీసీ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, మహిళా సంఘం, వివిధ బీసీ, ఎంబీసీ సంఘాల నాయకులు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

నాయకులుగా కాదు సేవకుల్లా పనిచేస్తాం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాము నాయకులుగా కాకుండా సేవకుల్లా పనిచేస్తామని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్షుడు చిలక సతీష్ అన్నారు. సోమవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురాడి చంద్రశేఖర్‌తో కలిసి పట్టణంలోని దుర్గానగర్, కేబీకాలనీ, సరస్వతినగర్ పాఠశాలలకు వెళ్లి అక్కడి హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సంఘ సభ్యత్వ రసీదులు ఇచ్చారు.

శుద్ధీకరణ ఘటనపై ఫిర్యాదు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: ఉత్తరాఖండ్ హల్ద్వాని ఘటనపై విచారణ జరిపి నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ ఎస్సీ విభాగం జిల్లా ఛైర్మన్ పరమేశ్వర్ కోలెట్కర్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ఆదిలాబాద్ టూటౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. హల్ద్వానిలో కాంగ్రెస్ నాయకులు మల్లికార్జునఖర్గే సభలో పాల్గొన్న అనంతరం ఆ స్థలాన్ని కొందరు శుద్ధీకరణ చేయటాన్ని వారు తప్పు పట్టారు. నాయకులు కాంబ్లె శివాజీ, మంథని సానియా, మనల లింగన్న, పుండ్ర నర్సింగ్, చంద్రాల రాహుల్ పాల్గొన్నారు.

సీఐ నాగరాజుకు ఫిర్యాదు ప్రతి అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జైనథ్, నార్నూర్: బాధ్యులపై కేసు నమోదు చేయాలని సోమవారం జైనథ్ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ ఎస్సీ విభాగం జిల్లా కార్యదర్శి బిక్కీ గంగన్న, జైనథ్, సాత్నాల ఎస్సీ విభాగం అధ్యక్షులు కోడిచెర్ల పొచ్చన్న, గుమ్మడి గణేశ్‌తో కలిసి ఎస్ఐ గౌతం పవార్‌కు ఫిర్యాదు చేశారు. నార్నూర్ పీఎస్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోవింద్ చవాన్, బ్రిజ్‌లాల్‌లు ఫిర్యాదు చేశారు.

రోడ్డుపై గుంతలను మట్టితో పూడ్చుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల శ్రమదానం

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉట్నూరు మండలం దంతనపల్లి సమీపాన పెద్దవాగు వంతెనతో పాటు రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన కాంగ్రెస్ నాయకుడు దాసండ్ల ప్రభాకర్, ఉపసర్పంచి మహ్మద్ ముబిన్ సోమవారం ఉదయం శ్రమదానం గుంతలను మట్టితో పూడ్చారు.

హెచ్‌సీఏ అండర్-19 ప్రాబబుల్స్‌లో చోటు

ఆదిలాబాద్ క్రీడావిభాగం: నార్నూర్ మండలం భీంపూర్ గ్రామానికి చెందిన జాదవ్ రాజాబాబు హెచ్‌సీఏ అండర్-19 ప్రాబబుల్స్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఆయనను కోచ్ ప్రదీప్, సీనియర్ క్రీడాకారుడు అతవుల్లాఖాన్ అభినందించారు.

ఏఐ ఏఎక్స్ఎల్ ప్రోగ్రాంతో ఆధునిక విద్య

జైనథ్: ఏఐ ఏఎక్స్ఎల్ ప్రోగ్రాంతో విద్యార్థులకు ఆధునిక విద్య లభిస్తుందని కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ సారథి అన్నారు. సోమవారం దీపాయిగూడ ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వం సరఫరా చేసిన నాలుగు కంప్యూటర్లను అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ అనిత, స్థానిక నేతలతో కలిసి ప్రారంభించి మాట్లాడారు.

గ్రామాభివృద్ధికి నిధులు ఇవ్వకుంటే రాజీనామాకు సిద్ధం

ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి జాదవ్ లఖన్‌సింగ్

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయకుంటే రాజీనామా చేస్తానని ఇంద్రవెల్లి మండలం ఎమాయికుంట సర్పంచి జాదవ్ లఖన్ సింగ్ చెప్పారు. ప్రజల ఓట్లతో గెలిచిన తాను వారి సమస్యలను పరిష్కరించలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమాయికుంట గ్రామ పంచాయతీలో మూడు గ్రామాలు ఉంటే ఆన్‌లైన్‌లో రెండే ఉన్నాయని, ఫలితంగా వాటికే ప్రభుత్వ నిధులు వస్తున్నాయని చెప్పారు. 1600 మంది జనాభా ఉండగా ప్రస్తుతం కేటాయిస్తున్న నిధులతో మూడు గ్రామాల అభివృద్ధి చేయలేక పోతున్నానని పేర్కొన్నారు. 16వ ఆర్థిక సంవత్సరం నిధులను తమ గ్రామానికి జనాభా దామాషా ప్రకారం కేటాయించాలన్నారు. రాజీనామా విషయాన్ని పంచాయతీ రాజ్, జిల్లా కలెక్టరుకు ఈ-మెయిల్ ద్వారా తెలిపినట్లు పేర్కొన్నారు. నిధులు ఇవ్వకుంటే రాజీనామా చేస్తానని ప్రజావాణిలో ఎంపీడీవోకు లిఖిత పూర్వకంగా తెలిపారు.

ఆర్డినరీ ఎక్స్‌ప్రెస్ అయ్యింది.. తిప్పలు తెచ్చింది

నేరడిగొండ, న్యూస్‌టుడే: ఆర్డినరీకి ఎక్స్‌ప్రెస్ బోర్డు ఉండటంతో విద్యార్థులు బస్సు ఎక్కారు. కానీ టికెట్‌కు డబ్బులు లేకపోవడంతో తేజాపూర్ బస్టాండ్‌లో వారిని కండక్టర్ దించేశారు. నేరడిగొండ మండలం వాంకిడికి చెందిన విద్యార్థులు అస్రఫ్ ఖాన్, అర్షాఖానమ్ బోథ్ బస్టాండ్‌కు వచ్చిన నిర్మల్ డిపో ఆర్డినరీ బస్సులో ఎక్కారు. బాలికకు మహాలక్ష్మి పథకం కింద రాయితీ ప్రయాణం వర్తించింది. ఇది ఎక్స్‌ప్రెస్ అని బాలుడిని టికెట్ తీసుకోవాలని కండక్టర్ కోరారు. కానీ బస్సుపాస్ మాత్రమే ఉంది. కండక్టర్ దిగమని సూచించారు. ఆ బాలుడు తన సోదరితో సహా తేజాపూర్ బస్టాండ్‌లో దిగారు. అక్కడ రోదిస్తున్న వీరిని చూసిన గ్రామస్థులు మరో ఆర్డినరీ బస్సులో ఎక్కించి పంపించారు. దీనిపై నిర్మల్ డీఎం పండరిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఈ రోజు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఈ రోజు మాత్రమే ఎక్స్‌ప్రెస్‌గా నడిపించామని చెప్పారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి

నార్నూర్: నార్నూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని భాజపా మండల అధ్యక్షుడు భిక్కు రాఠోడ్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్యాంసుందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

పదోతరగతి లాంగ్ మెమోలు వచ్చాయ్

కలెక్టరేట్: మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షలు, జూన్‌లో నిర్వహించిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలకు సంబంధించిన అసలు ఉత్తీర్ణత పత్రాలు(లాంగ్ మెమో) పాఠశాలలకు వచ్చాయని డీఈఓ మాధవి తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ తమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి వారి నుంచి ఉచితంగా పొందాలని సూచించారు.

మహనీయుల జీవితాలు ఆదర్శం

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: అన్నాభావుసాఠే, లహూజీ, అంబేడ్కర్ వంటి మహనీయుల జీవితాలు అందరికీ ఆదర్శనీయమని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన అన్నాభావు సాఠే జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. భారాస పట్టణ అధ్యక్షుడు అజయ్, దమ్మపాల్, సచిన్, గైక్వాడ్‌యాదవ్, సునీల్ వాగ్మారే, సూర్యవంశీ పాల్గొన్నారు.

అన్నాభావుసాఠే చిత్రపటానికి పూలమాల వేస్తున్న జోగు రామన్న

గుడిహత్నూర్(భుక్తాపూర్): మన్నూర్ గ్రామంలో సోమవారం అన్నాభావు సాఠే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు, నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎంఐఎం మాజీ జిల్లా అధ్యక్షుడు ఫారూక్ అహ్మద్‌కు బెయిల్

ఎదులాపురం, న్యూస్‌టుడే: హత్య, హత్యాయత్నం కేసులో జైలులో ఉన్న ఆదిలాబాద్ మున్సిపాలిటీ మాజీ ఉపాధ్యక్షుడు, ఎంఐఎం మాజీ జిల్లా అధ్యక్షుడు ఫారూక్ అహ్మద్‌కు హైకోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. 2020 డిసెంబరు 18వ తేదీన తాటిగూడలో పిల్లల క్రికెట్ వివాదంలో పెద్దలు తగవులాడిన సందర్భంగా ఫారూక్ అహ్మద్ తన వద్ద రివాల్వర్‌తో కాల్పులు జరపటం అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ ఘటనలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సయ్యద్ జమీర్, సయ్యద్ మొహతెసీన్ గాయపడ్డారు. వీరిలో మాజీ కౌన్సిలర్ అయిన సయ్యద్ జమీర్ డిసెంబరు 26వ తేదీన మృతి చెందారు. దీంతో ఆదిలాబాద్ టూటౌన్ పోలీసులు ఫారూక్ అహ్మద్‌ను అరెస్టు చేసి హత్యాయత్నం, మారణాయుధాలు కలిగి ఉన్నారని అభియోగాలు మోపి కేసు నమోదు చేశారు. సయ్యద్ జమీర్ మృతి చెందటంతో హత్య కేసును జోడించారు. అదే నెల 18వ తేదీన రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు ఆదిలాబాద్ సెషన్స్ న్యాయస్థానంలో సుదీర్ఘంగా కొనసాగిన అనంతరం ఫారూక్ అహ్మద్‌కు ప్రత్యేక న్యాయస్థానం జీవితఖైదు విధిస్తూ 2022 జనవరి 24న తీర్పును వెలువరించింది. తరువాత అతడిని చెర్లపల్లి జైలుకు తరలించారు. హైకోర్టులో అప్పీలు చేసుకున్న ఆయనకు సోమవారం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల సొంత పూచీకత్తు, ఇద్దరు ష్యూరిటీలు ఆదిలాబాద్ కోర్టులో సమర్పించాలని ఆదేశించింది.

అటవీ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

నేరడిగొండ, న్యూస్‌టుడే: అటవీ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన వన్యప్రాణుల, పర్యావరణ కమిటీ ప్రాథమిక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో వన్యప్రాణుల సంరక్షణతో పాటు, అటవీ ప్రాంతాల్లో తరతరాలుగా నివసిస్తున్న గిరిజనులు, స్థానిక ప్రజల జీవనోపాధి, వారి హక్కులకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సమస్యలు పరిష్కరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

దిశ కమిటీలో కేస్లాపూర్ సర్పంచికి చోటు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ సర్పంచి మెస్రం తుకారంను జిల్లా దిశ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ కలెక్టర్, దిశ సభ్య కార్యదర్శి రాజర్షిషా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తుకారాం విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి దిశ కమిటీ సభ్యుడిగా నియమించిన ఎంపీ గోడం నగేశ్, జిల్లా కలెక్టర్ రాజర్షిషాలకు ధన్యవాదాలు తెలిపారు.

ఓటర్లతో కిక్కిరిసిన తహసీల్దార్ కార్యాలయం

సిరికొండ, న్యూస్‌టుడే: సర్ నోటీసులు జారీ అయిన ఓటర్లు ఆధారాలు సమర్పించేందుకు సోమవారం సిరికొండ మండల తహసీల్దార్ కార్యాలయానికి భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో కార్యాలయం కిక్కిరిసిపోయింది. ఓటర్లు భారీగా తరలిరావడంతో తహసీల్దార్ ఛాంబర్‌లోకి కూడా ఒక్కసారిగా పలువురు చొరబడటంతో ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంది. కార్యాలయం ఇరుకుగా ఉండటంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు, మహిళలు, గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, కనీసం తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు మరింత పెరిగాయని ఓటర్లు వాపోయారు.

తహసీల్దార్ కార్యాలయం ముందు బారులు తీరిన ఓటర్లు

తడి, పొడి చెత్తపై అవగాహన

ఇచ్చోడ, న్యూస్‌టుడే: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్త నిర్వహణపై ముఖరా(కె) గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తడి, పొడి, హానికరమైన చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు అవసరమైన చెత్త బుట్టలను ఏర్పాటు చేసి ప్రజలు అందులో వేయాలని అవగాహన కల్పించారు. సర్పంచి గైక్వాడ్ జైపాల్, ఉపసర్పంచి బాలాజీ, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

చాందూరిలో మద్యపాన నిషేధానికి తీర్మానం

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉట్నూరు మండలం చాందూరి పంచాయతీ పరిధిలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తున్నట్లు సర్పంచి ప్రేమలాబాయి చెప్పారు. స్థానికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ చాందూరిలో మద్యం అమ్మకాలు చేయొద్దని కోరారు. ఈమేరకు వార్డు సభ్యులు, స్థానికులతో కలిసి తీర్మానం చేశారు. తీర్మాన ప్రతిని ఆబ్కారీ శాఖతో పాటు ఉట్నూరు పోలీసులకు అందించినట్టు సర్పంచి తెలిపారు. ఉపసర్పంచి పరమేశ్వర్, మాజీ సర్పంచి రఘునాథ్‌రావ్, స్థానికులు, నాయకులు సంజీవ్, నైతం మారుతి, వెంకటరమణ, నాగోరావ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉప సర్పంచి పరమేశ్వర్

ట్రెజరీ డీడీగా హారిక

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ట్రెజరీ శాఖ డీడీగా హారిక సోమవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పనిచేస్తున్న రామచంద్రరాజు పదవీ విరమణ పొందారు.

ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం(ఓ)గా మల్లేశయ్య

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం(ఓ)గా నియమితులైన ఎం.మల్లేశయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ రీజియన్ కొల్లాపూర్ డిపోలో పనిచేసిన ఆయన పదోన్నతిపై ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన ఆయనను ఆర్ఎం విజయభాను, డిప్యూటీ ఆర్ఎం(ఎం) రామయ్య సన్మానించారు.

ఏక బిల్వేశ్వర ఆలయంలో దేవాదాయ శాఖ ఏసీ పూజలు

ఆదిలాబాద్ గ్రామీణం, సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్(ఏసీ) బి.సుదర్శన్ పటేల్ సోమవారం ఆదిలాబాద్ గ్రామీణ మండలం దిమ్మ గ్రామంలోని ఏక బిల్వేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సమీపంలో ఉన్న ఏక బిల్వ వృక్షాన్ని దర్శించుకొని దాని విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు.

గృహజ్యోతి లబ్ధిదారుడికి షాకిచ్చిన బిల్లు

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: జైనథ్ మండలం సాంగ్వి గ్రామానికి చెందిన లాండే సురేష్ 3 ఎకరాల్లో వ్యసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు నివాసాలకు రాయితీ కింద ప్రభుత్వం జీరో బిల్లు అమలు చేయడంతో అప్పటి నుంచి ఈయనకు బిల్లు రావడం లేదు. అనుకోకుండా ఏప్రిల్ నెలకు సంబంధించి ఏకంగా రూ.1,49,397 బిల్లు రావడంతో అవాక్కయ్యారు. విద్యుత్తు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే నెలకిందట కొత్తమీటరు అమర్చారు. పాతబిల్లు కట్టాల్సిందేనని ఒత్తిడి తెస్తుండటంతో మరోమారు ఆదిలాబాద్‌లోని విద్యుత్తు సంస్థ ఎస్ఈ కార్యాలయానికి వచ్చారు. మాజీ సర్పంచి విఠల్‌రెడ్డితో కలిసి అధికారులకు తన గోడు వెల్లబోసుకున్నారు.

గ్రామ సభలు నిర్వహించండి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతిపాదిత విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. సోమవారం తన ఛాంబరులో పనుల పురోగతి, భూసేకరణ, సామాజిక ప్రభావ అంచనా సర్వే అంశాలపై సమీక్షించారు. తుది మ్యాప్ ఆధారంగా 2,009 ఎకరాల భూసేకరణలో వేగం పెంచాలన్నారు. అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ జగదీశ్వర్, సర్వేల్యాండ్ రికార్డ్సు ఏడీ ప్రభాకర్, నీటిపారుదలశాఖ ఎస్ఈ ప్రభుకళ్యాణ్, విద్యుత్తుశాఖ ఎస్ఈ సుభాష్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

102 వాహనానికి మరమ్మతులు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని 102 అంబులెన్సు వాహనం అయిదు రోజుల కిందట మొరాయించింది. అప్పటి నుంచి ఆసుపత్రి ఆవరణలోనే నిలబడి ఉంది. దీంతో సేవలు అందక గర్భిణులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం అంబులెన్సు సిబ్బంది వాహనానికి మరమ్మతులు చేపట్టారు. ఆపదలో కాపాడే వాహనాలకు సకాలంలో మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆదివాసీల నోవోంగ్ పూజలు

బజార్‌హత్నూర్, న్యూస్‌టుడే: తమ ఆరాధ్య దేవతలను పూజిస్తు నోవోంగ్ పూజలు చేశారు. మండలంలోని చింతలసాంగ్వీ సీడాం ఆదివాసీలు ఏటా సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తారు. కొత్తగా పండించిన పంటలతో చేసిన నైవేద్యాలను సమర్పించారు. సుభాష్, హన్మంతు, భీమన్న, లక్ష్మణ్, యాదవ్, తుకారాం తదితరులు ఉన్నారు.

సౌరదీపాల ఏర్పాటుకు ఆదేశాలు

నేరడిగొండ, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద రాత్రి సమయాల్లో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను ఎంపీ గోడం నగేశ్ గుర్తించారు. వెంటనే సౌరదీపాలు రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించారు.

సాత్నాల ఎంపీడీవోగా జమీల్ హైమద్

జైనథ్: సాత్నాల ఎంపీడీవోగా జమీల్ హైమద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బేలలో సూపరింటెండెంట్‌గా ఉన్న ఆయనను సాత్నాల మండల పరిషత్తు అభివృద్ధి (ఎంపీడీవో) అధికారిగా నియమించారు.

(c) eenadu